RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 309 పేజీలు - 08 శనివారం 03 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా

# అల్పాహార పథకం

**పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు**

**నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు**

**నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం**

**ఆహార నాణ్యత కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన**




తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 02 :ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు

మిగతాది 2లో...

# హాకీలో స్వర్ణం

**44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్**

**ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం**

**ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం**

**2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్**




తొలి అక్షరం/న్యూఢిల్లీ, అక్టోబర్ 02:
భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి.అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మర్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. మిగతాది 2లో...

# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

**గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే మా పాలన**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**గాంధీ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు**

హైదరాబాద్, అక్టోబర్ 02(ఆర్ఎన్ఏ):



తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 02 :

గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళు లర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ మిగతాది 2లో...

# మీరు నా ఆరాధ్య దైవం

**మోదీతో అంటూ స్మిత్ భావోద్వేగం**

**ఫైదుబాయ్ హీరో పైలట్ స్మిత్ మచ్చర్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ**

**స్మిత్ ధైర్యసాహసాలను కొనియాడి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**దాడి సమయంలో హనుమాన్ చాలీసా పఠించానని ప్రధానికి వివరించిన పైలట్**

**వైద్య సహాయంతో పాటు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని**



# కరవుసీమ ఇకపై కనకసీమ



**మదనపల్లెలో "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్" శంకుస్థాపన**

**సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు**

**మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య**

తొలి అక్షరం/మదనపల్లె అక్టోబర్ 02 : కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 2లో...






# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

**టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాల విక్రయాన్ని ఆపాలని వినతి**

**ఇది విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు తొలి అడుగని ఆందోళన**

**కాంగ్రెస్ జాతీయ విధానాలకు ఇది విరుద్ధమని లేఖలో ప్రస్తావన**

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 02 :తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ మిగతాది 2లో...

## గాంధీ ఆరాధించిన రాముడు

# ధనికుల దేవుడా

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్**

**గాంధీ ఆశయాలను ప్రధాని మోదీ నెరవేరుస్తున్నారని, నిజమైన వారసులు బీజేపీయేనని వ్యాఖ్య**

**ఖైరతాబాద్ ఉపఎన్నికలో హిందూ ఓట్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా**



తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 02 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి మిగతాది 2లో...

# కొడంగల్‌లో సభ పెడతాం

**రేవంత్ కు చెమటలు పట్టిస్తాం**

**ఖైరతాబాద్ లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం**

**తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు**

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి

మిగతా 2లో...



# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

**19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు**

**కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా**

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో

మిగతాది 2లో...



# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్ రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

# హాకీలో స్వర్ణం



(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

# కొడంగల్‌లో సభ పెడతాం

(మొదటి పేజీ తరువాయి)

తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

# గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా

(మొదటి పేజీ తరువాయి)

నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్, ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన స్పష్టం చేశారు.

త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32,000 ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# మీరు నా ఆరాధ్య దైవం

## మోదీతో అంటూ స్మిత్ భావోద్వేగం

తొలి అక్షరం/న్యూఢిల్లీ, అక్టోబర్ 02 :

విమానంలో తోటి పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఫ్లైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు.

ఆయన ధైర్యసాహసాలను కొనియాడుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అతిపెద్ద ఆరాధ్య దైవం, ఆదర్శప్రాయుడు ప్రధాని మోదీయేనని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు.

దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై తోటి పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కుప్పకూలినప్పటికీ, స్మిత్ అసామాన్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. చివరి క్షణంలో కాక్‌పిట్ డోర్ లాచ్‌ను నొక్కి తలుపు తెరిచారు.

దీంతో ప్రయాణికులు వెంటనే లోపలికి ప్రవేశించి, దాడి చేస్తున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల 9/11 తరహా పెను ప్రమాదం తప్పిందని, 174 మందికి పైగా సురక్షితంగా బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధానితో సంభాషణ సందర్భంగా స్మిత్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను కష్ట సమయాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, విమానంలో దాడి జరిగినప్పుడు కూడా ప్రాణాలతో పోరాడుతూ హనుమాన్ చాలీసానే చదువుకున్నానని వివరించారు.

అనంతరం ప్రధాని మోదీ, స్మిత్ తల్లి గీతా బెన్‌తో కూడా మాట్లాడారు. భగవద్గీత విలువలు, బోధనలతో కుమారుడిని పెంచినందుకు ఆమెను అభినందించారు. స్మిత్ త్వరగా కోలుకోవడానికి అవసరమైన వైద్య సహాయంతో పాటు అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాని మోదీ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# కరవుసీమ ఇకపై కనకసీమ

(మొదటి పేజీ తరువాయి)

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు.

ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.



## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి.. రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి': అనంత్ అంబానీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం



పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు.

ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

# డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ జీవితం అందరికీ ఆదర్శనీయం

**- తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 2:** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస,శాంతి మార్గాలు అందరికీ ఆదర్శనీయమని, ఆ మహనీయుని సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి లు అన్నారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తొర్రూరు డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్ లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీ వహించిన పాత్ర అపూర్వమైనదని కొనియాడారు. ఎలాంటి ఆయుధం లేకుండా కేవలం సత్యం, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో బ్రిటిష్ పాలనను నిర్వీర్యం చేసి దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తెచ్చిపెట్టిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని స్మరించుకున్నారు. నేటి తరం ఆయన ఆశయాలను, త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసుకుని నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.వెంకన్న యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, జక్కుల రాంరెడ్డి, చెవిటి సధాకర్, జాటోత్ రవి నాయక్, వెంకట్ రెడ్డి, కర్ర అశోక్ రెడ్డి, కాటం మల్లారెడ్డి,భూసాని రాము, తాళ్ల పెల్లి బిక్షం గౌడ్, నల్లపు రాజు, నడిగడ్డ శ్రీనివాస్,తాళ్ల పెల్లి రమేష్ గౌడ్, కె.నరేష్ రెడ్డి, కల్లూరి కుశాల్, బిజ్జాల అనిల్, మహేష్ యాదవ్,మనోహర్,ఎలగందుల శ్రీనివాస్, రమేష్ నాయక్, అంకుష్, నడిగడ్డ మధు, చంటి తదితరులు పాల్గొన్నారు.

# రూ.2.47 కోట్ల ప్రభుత్వ ధాన్యం స్వాహా

**- మటేడు శ్రీ వెంకటేశ్వర బిన్నీ రైస్ మిల్లుపై విజిలెన్స్ దాడులు**

**- ఐదుగురిపై కేసు.. రిమాండ్‌కు తరలింపు**

**- తొర్రూర్ డీఎస్పీ కృష్ణ కిశోర్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 2:** తొర్రూర్ మండలం మటేడు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర బిన్నీ రైస్ మిల్లులో రూ.2.47 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిన ఉదంతం కలకలం రేపింది. విజిలెన్స్, సివిల్ సప్లయ్స్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన భౌతిక తనిఖీల్లో ఈ భారీ అక్రమం వెలుగు చూసింది.అధికారుల కథనం ప్రకారం.. 2022-23 విడతకు సంబంధించిన రికార్డుల ఆధారంగా మిల్లులో 1,011.880 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం నిల్వలు ఉండాల్సి ఉంది. అయితే తనిఖీల సమయంలో సదరు ధాన్యం మిల్లు ప్రాంగణంలో అందుబాటులో లేకపోవడంతో స్వాహా చేసినట్లు నిర్ధారించారు. పక్కదారి పట్టిన ధాన్యం మార్కెట్ విలువ రూ.2,47,09,098 ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు.**బాధ్యులపై క్రిమినల్ కేసులు** ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసాన్ని గుర్తించిన టీజీఎస్‌సీఎస్‌సీఎల్ జిల్లా మేనేజర్ తొర్రూర్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు శ్రీ వెంకటేశ్వర బిన్నీ రైస్ మిల్లు ప్రొప్రైటర్ బొల్లం వెంకన్నతో పాటు భాగస్వాములైన బొల్లం కొమురెల్లి, మహంకాళి రమేష్, తాటికొండ వెంకన్న, ఎక్కటి కృష్ణారెడ్డిలపై కేసు నమోదు చేశారు. ఈ విషయమై తొర్రూర్ డీఎస్పీ కృష్ణ కిశోర్ మాట్లాడుతూ..

కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురిని తొర్రూర్ సీఐ గణేష్, ఎస్ఐ మహేందర్ రెడ్డిలతో కలసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ వ్యవహారంపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు.

# గ్రామసభలో పంచాయతీ కార్యదర్శిపై సంచలన ఆరోపణలు

**- నిబంధనలకు విరుద్ధంగా 32 పర్యాయాలు చెల్లింపులు చేశానని అంగీకరించారు: సర్పంచ్ గీర్కాటి నిరంజన్ గౌడ్**



**తొలి అక్షరం/చౌటుప్పల్.అక్టోబర్ 2:** గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న దండు మల్కాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ పాలన, నిధుల వినియోగం, గ్రామ సమస్యలపై వాడీవేడిగా చర్చ జరిగింది. గ్రామపంచాయతీ కార్యదర్శి రమాదేవిపై గతంలో గ్రామస్తులు చేసిన ఆరోపణల నేపథ్యంలో డీఎల్‌పీవో సమర్పించిన నివేదికపై కూడా గ్రామసభలో చర్చ జరిగింది.ఈ సందర్భంగా డీఎల్‌పీవో నివేదికపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి రమాదేవి, పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలను పాటించకుండా 32 పర్యాయాలు చెల్లింపులు చేసినట్లు స్వయంగా అంగీకరించారని సర్పంచ్ గీర్కాటి నిరంజన్ గౌడ్ తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోని దాదాపు 250 గ్రామ పంచాయతీల్లోనూ ఇదే విధంగా పంచాయతీరాజ్ నిబంధనలకు విరుద్ధంగా కార్యదర్శులు నిధులు డ్రా చేశారని ఆమె గ్రామసభలో పేర్కొన్నారని సర్పంచ్ వెల్లడించారు.గ్రామస్తులు అడిగిన పలు సమస్యలపై సమాధానం ఇవ్వాలని కోరినప్పటికీ, తాను అవలంబించిన విధానమే సరైనదంటూ కార్యదర్శి వాదించడం జరిగిందని ఆయన తెలిపారు.అదేవిధంగా 2018 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 6(3)(సి) ప్రకారం గ్రామసభ ప్రోటోకాల్‌కు విరుద్ధంగా పీఏసీఎస్ చైర్మన్, దేవాలయ చైర్మన్‌లను ప్రత్యేక ఆహ్వానితులుగా వేదికపైకి ఆహ్వానించడం ద్వారా నిబంధనలను ఉల్లంఘించారని సర్పంచ్ ఆరోపించారు.గ్రామ సమస్యలపై గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ సర్పంచ్ గీర్కాటి నిరంజన్ గౌడ్ ప్రతి సమస్యపై వివర ణ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని గ్రామస్తులు కోరగా, గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. అయితే ఈ తీర్మానాన్ని బెల్ట్ షాపుల నిర్వాహకులు వ్యతిరేకించారని పేర్కొన్నారు.

గ్రామసభలో చర్చించిన అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి, పంచాయతీరాజ్ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గీర్కాటి నిరంజన్ గౌడ్ కోరారు.

# గాంధీజీ ఆశయాలే నేటి తరానికి దిక్సూచి

**• సత్యం, అహింస, శాంతి సిద్ధాంతాలను ఆచరించాలి: ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ**

**తొలి అక్షరం/ఏన్కూర్ అక్టోబర్ 2:** ఏన్కూరు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఏన్కూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా ప్రెస్‌క్లబ్ సభ్యులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, మార్కెట్ చైర్మన్ లచ్చిరాం నాయక్, మాజీ ఎంపీటీసీ మెడ ధర్మారావు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ మాట్లాడుతూ.. గాంధీజీ పాటించిన సత్యం, అహింస, శాంతి సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. గాంధీజీ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.జాతీయ నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ వారి సేవలను ప్రజలకు గుర్తుచేస్తూ సామాజిక చైతన్యం తీసుకురావడంలో ఏన్కూరు ప్రెస్‌క్లబ్ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# పేరుకే మహిళా ప్రజాప్రతినిధులు.. పెత్తనం మాత్రం భర్తలదేనా?

**• ప్రజలు ఎన్నుకున్నది మహిళలను.. పాలన సాగిస్తున్నది భర్తలా?**

**అధికారుల కళ్ల ముందే సాగుతున్న 'పెత్తనం'పై ప్రజల ప్రశ్న**




**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 2:** మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ, కొన్ని చోట్ల ఎన్నికైన మహిళా సర్పంచులు, కౌన్సిలర్ల స్థానంలో వారి భర్తలు లేదా కుటుంబ సభ్యులే అధికార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ప్రజాప్రతినిధులు ఉండగా, వారి స్థానంలో ఇతరులు అధికారిక వ్యవహారాలను నడిపించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.చౌటుప్పల్ పట్టణ, మండల పరిధిలోని కొన్ని స్థానిక సంస్థల్లో మహిళా ప్రజాప్రతినిధుల భర్తలు సమావేశాలు, అధికారులతో చర్చలు, అభివృద్ధి పనుల వ్యవహారాల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అసలు ప్రజాప్రతినిధి ఎవరు? నిర్ణయాలు తీసుకునేది ఎవరు? అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.మహిళలకు పదవులు కేవలం రిజర్వేషన్ ద్వారా కల్పించడం మాత్రమే కాకుండా, వారు స్వతంత్రంగా ప్రజాప్రతినిధులుగా వ్యవహరించేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. ఎన్నికైన సర్పంచ్ లేదా కౌన్సిలర్‌కు సంబంధించిన అధికారిక బాధ్యతలను ఇతరులు నిర్వహిస్తుంటే సంబంధిత అధికారులు దానిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.మహిళా సాధికారత పేరుతో పదవులు మహిళలకు కేటాయించి, వాస్తవ పాలనా వ్యవహారాల్లో మాత్రం భర్తలు పెత్తనం చెలాయిస్తే రిజర్వేషన్ల అసలు లక్ష్యం నీరు గారిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిపై జిల్లా, మండల స్థాయి అధికారులు సమగ్రంగా పరిశీలించి, ఎన్నికైన ప్రజాప్రతినిధులే తమ రాజ్యాంగబద్ధ బాధ్యతలను స్వతంత్రంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజల చేత ఎన్నుకోబడిన పదవి మహిళదైతే.. ఆ పదవికి సంబంధించిన నిర్ణయాధికారం కూడా ఆమెదే కావాలి. మహిళా సాధికారత కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాల్సిన అవసరం ఉంది.

# రాచకొండ గడ్డపై దసరా సంబరాలకు ఇవిల్వీ భాస్కర్ శ్రీకారం!

**- అక్టోబర్ 4న రామాలయం వద్ద ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ**



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 2:** రాచకొండ గడ్డపై ఘనంగా నిర్వహించనున్న రాచకొండ దసరా ఉత్సవాలు2026కు ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టనున్నారు. దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు రాచకొండ రామాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.రాచకొండ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ ప్రత్యేకంగా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. యువతను భాగస్వాములను చేస్తూ, అన్ని గ్రామాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు, యువత, పెద్దలు, రాచకొండ పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.ప్రజలందరి భాగస్వామ్యంతో రాచకొండ దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**- షాగా చంద్రశేఖర్ రెడ్డి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు**



**తొలి అక్షరం/చౌటుప్పల్,సెప్టెంబరు28:** త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడూ బాధ్యతాయుతం గా ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు షాగ చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాసనమండలికి జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును పొందేందుకు నిర్ణీత గడువులోగా దరఖాస్తు ఫారాన్ని (ఫారం-18) పూర్తి చేయాలని బిజెపి, బి జె వై ఏం నాయకులను కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటూ కీలకమని, విద్యావంతులు భాగస్వాములైతేనే సరైన ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి అని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటరు నమోదు ప్రక్రియను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని సూచించారు.నాయకులు, కార్యకర్తలు ముందస్తుగానే తమ ఓట్లను నమోదు చేసుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిధిలోని పట్టభద్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తూ నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని కోరారు.

## సీనియర్ కార్యకర్తలకు డివిజన్ అధ్యక్ష పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

### - సేవాదళ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.డి. జానీ



**ఖమ్మం, అక్టోబర్ 2 (తొలి అక్షరం):** పార్టీ కష్టకాలంలో జెండా మోసి, ఏళ్ల తరబడి పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ కార్యకర్తలకు డివిజన్ అధ్యక్ష పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ సేవాదళ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.డి. జానీ కోరారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రకటించిన డివిజన్ అధ్యక్షుల జాబితాను పునఃసమీక్షించి, కష్టపడ్డ నిజమైన కార్యకర్తలకు పదవులు దక్కేలా చూడాలని కోరారు. పార్టీ కష్టకాలంలో కేసులు, లాఠీ దెబ్బలకు వెరవకుండా పనిచేసిన సీనియర్ కార్యకర్తలకు న్యాయం చేయాలని జానీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సేవాదళ్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లింగరాజుపల్లిలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

### - గ్రామ సర్పంచి బొడిగ లింగస్వామి



**వలిగొండ, అక్టోబర్ 2 (తొలి అక్షరం):** లింగరాజుపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచి బొడిగ లింగస్వామి అధ్యక్షతన మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కార్యక్రమ అధికారి, ఉపసర్పంచి, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, గ్రామ సిబ్బంది, నాయకులు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు




**వలిగొండ, అక్టోబర్ 2 (తొలి అక్షరం):** జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వలిగొండ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఫోరం మండల అధ్యక్షుడు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి కుంభం వెంకట్ పాపిరెడ్డి, ఉపసర్పంచి మలుగ మాధవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవగౌడ్ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ చూపిన అహింస, సత్యం, దేశభక్తి మార్గాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు శ్రీచైతన్య పాఠశాలకు వర్తించవా?

### - సెలవు రోజున ఉపాధ్యాయులతో విధులు చేయిస్తున్నారంటూ తల్లిదండ్రుల ఆందోళన




**వలిగొండ, అక్టోబర్ 2 (తొలి అక్షరం):** గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ విద్యాసంస్థలకు సెలవు ఉన్నప్పటికీ వలిగొండ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాలకు పిలిపించారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా పాఠశాల నిర్వహించడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీజీ జయంతి రోజున కూడా పాఠశాల నిర్వహించడంపై తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు పాఠశాలకు వెళ్లడంతో విద్యార్థులను బయటకు పంపించారని తెలిపారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వారు ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### • నెక్కొండ సర్పంచి పెండ్యాల హరిప్రసాద్




**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 2:** ఉపాధి హామీ చట్టం ద్వారా అమలవుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నెక్కొండ సర్పంచి పెండ్యాల హరిప్రసాద్ కోరారు. గాంధీ జయంతి సందర్భంగా నెక్కొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలపై చర్చించారు. గ్రామస్థులు తమ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబరు 2:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నెక్కొండ మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, మండల అధ్యక్షులు లావుడియా తిరుమల్ చౌహన్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి, అహింస మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు గాంధీజీ చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. నేటి సమాజంలో గాంధీజీ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు

### - చంద్రుగొండ సర్పంచి బక్కి కవిత - అశోక్



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 2:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చంద్రుగొండ గ్రామంలో గాంధీ విగ్రహానికి సర్పంచి బక్కి కవితఅశోక్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి, అహింస మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు గాంధీజీ చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు బక్కి నరేష్, ఉపసర్పంచి బుద్దె సంపత్, కాంగ్రెస్ అధ్యక్షుడు గోక అనిల్, వార్డు సభ్యులు బక్కి రాజశేఖర్, భువనగిరి సుస్మిత, శివ కొమ్ముల చిన్నారి, మామిళ్ల మల్లారెడ్డి, బక్కి కుమారస్వామి, సంఘని ప్రకాష్, సిరిబొమ్మల అశోక్, పోకల ముని, చిద్రబోయిన రాజు, సురేష్, భక్తి సురేష్, అడప కృష్ణ, చిత్రబోయిన సత్తి తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పొన్నాల మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్

### - సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్



**తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 2:** నెక్కొండ మండలం బంజరుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన అధ్యక్షులు పొన్నాల స్వామి తండ్రి పొన్నాల మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచి ఎర్ర సుజాత రాజు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు జనగాం వెంకటేశ్వర్లు, పొన్నాల కృష్ణంరాజు, బోడ భాస్కర్ నాయక్, బాబు, పొన్నాల యాకయ్య, బోడ రాజేష్, క్షేత్ర సహాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల నివాళులు



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 2:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నెక్కొండ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ సభ్యులు, మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్, సీనియర్ నాయకులు కొమ్ము రమేష్‌యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి శివకుమార్, కారింగుల సురేష్‌గౌడ్, దేవనబోయిన వీరభద్రం, పొడిశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హుచ్ శ్రీనివాస్, ఇదునూరి వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి రాజు, ఇదునూరి దిలీప్, బండారి చిన్నా, ఉల్లేరావు ప్రభాకర్, పొలిశెట్టి చరణ్, బొల్లిపల్లి శ్రవణ్, రెగుల అశోక్, ఎండీ మహబూబ్‌పాషా, జక్కుల సదయ్య, ఆకులపల్లి నరేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ప్లాంట్‌కు అనుమతి ఇవ్వొద్దని వినతి

### - ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోలిశెట్టి భాను ప్రకాష్



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 2:** నెక్కొండ మండల పరిధిలోని అప్పలరావుపేట రోడ్డులో గోదాముల సమీపంలో ప్రతిపాదించిన సీబీజీ గ్యాస్ ప్లాంట్‌కు అనుమతి ఇవ్వొద్దని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోలిశెట్టి భాను ప్రకాష్ కోరారు. గ్రామానికి సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేస్తే వ్యర్థాల దుర్వాసన, దోమల సమస్య, గాలి కాలుష్యంతో పాటు అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు గ్రామసభలో ఎంపీడీవో, సర్పంచి పెండ్యాల హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మౌటం కృష్ణరాజు, ఈదునూరి ప్రభాకర్, చల్లా రఘోత్తంరెడ్డి, ఎండీ రఫీపాషా, వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన గాంధీ 157 జయంతి వేడుకలు



**తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 02:** నెల్లికుదురు మండలం స్థానిక కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగినాయి. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గాంధీ జయంతి రోజు అక్టోబర్ 2న జరుపుకోవడం దేశానికి గర్వకారణం. మహాత్మా గాంధీ అహింస పద్ధతిలో స్వాతంత్రాన్ని రావడానికి మూల కారణం మన జాతిపిత మహాత్మా గాంధీ చెప్పుకోవడం దేశ గర్వకారణమని చెప్పడం జరిగింది. అదేవిధంగా గాంధీజీ ఆలోచనలు కేవలం రాజకీయ స్వాతంత్రానికి పరిమితం కాలేదు అన్నగారిన వర్గాల అభ్యున్నతి మతసామరస్యం మహిళ సాధికారికత వంటి సామాజిక సంస్కరణలను ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఈ గాంధీ జయంతి పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా పాఠశాలలు కళాశాలలో ప్రభుత్వ ప్రైవేటు సంస్థల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. న్యూఢిల్లీలో రాజ్ ఘాట్ వద్ద రాష్ట్రపతి ప్రధానమంత్రి తో పాటు ప్రముఖులు గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి హెచ్ వెంకటేశ్వర్లు, గొల్లపల్లి ప్రభాకర్, పెరుమాండ్ల గుట్టయ్య,వల్లభుజ వెంకటేశ్వర్లు, రత్నపురం యాకయ్య, కృష్ణ, వెంకటేష్, మద్ది రాజేష్, దర్శనం ప్రశాంత్, పూర్ణచందర్, బక్కీ రెడ్డి,అఫ్రోజ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రులచే ప్రతిభ అవార్డును అందుకున్న అంజుమ్ సుల్తానా

**తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 02:** నెల్లికుదూరు ఆదర్శ పాఠశాలలో సోషల్ టీచర్గాంధీ జయంతి వేడుకల్లో ఎం.ఏ. అంజుమ్ సుల్తానా కు ప్రతిభా పురస్కారంహైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహించిన 157వ గాంధీ జయంతి వేడుకల్లో ఆదర్శ పాఠశాల నెల్లికుదురు మహబూబాబాద్ జిల్లాకు చెందిన టిజిటి సోషల్ టీచర్ ఎం.ఏ. అంజుమ్ సుల్తానా విద్యారంగంలో అందిస్తున్న సేవలకు గాను "ప్రతిభా అవార్డు"ను దంపతులకు సన్మానించి అందజేశారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, లాల్ బహదూర్ స్టేడియం లో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సామాజిక అవగాహన, నాణ్యమైన బోధనకు అంజుమ్ సుల్తానా చేస్తున్న కృషికి ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది.



# గ్రామాభివృద్ధికి ప్రజలే భాగస్వాములు!

**అంకిరెడ్డిగూడెంలో వికసిత్ భారత్ గ్రామ ప్రణాళికకు శ్రీకారం**

**325 అభివృద్ధి పనుల గుర్తింపు..**

**గ్రామసభలో అభివృద్ధిపై సమగ్ర చర్చ**



**తొలి అక్షరం/చౌటుప్పల్:సెప్టెంబర్ 2:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని మహాత్మా గాంధీ చిత్రపటానికి సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ముగ్గులతో గ్రామ పటాన్ని రూపొందించి, గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను అందులో వివరించారు. అనంతరం వికసిత్ భారత్ గ్రామ ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఓ ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల అభిప్రాయాల ఆధారంగా గుర్తించి ప్రణాళికలో నమోదు చేసే ప్రక్రియలో భాగంగా మొత్తం 325 పనులను గుర్తించారు. నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధి కల్పన, విపత్తుల నిర్వహణతో పాటు గ్రామానికి అత్యవసరమైన పలు అభివృద్ధి పనులను గ్రామసభలో చర్చించారు. గ్రామంలోని రెండు అంగన్‌వాడీ భవనాలు, గ్రంథాలయ భవనం, మహిళా భవనానికి ప్రహరీ, స్మశానవాటిక ప్రహరీ నిర్మాణం, మూడు మట్టి రోడ్ల నిర్మాణం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, కుంటల పూడికతీత తదితర పనులను గుర్తించి నమోదు చేశారు. వికసిత్ భారత్ గ్రామ ప్రణాళిక ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 60:40 నిష్పత్తిలో అభివృద్ధి పనులను అమలు చేయడంతో పాటు పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రైతులకు సంబంధించిన పనులతో పాటు ఇంకుడు గుంతల నిర్మాణాలు, నైపుణ్యాభివృద్ధి భవనాలు, మెటల్ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలను కూడా గుర్తించి, గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం ద్వారా అంకిరెడ్డిగూడెంను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వలందాస్ మహేష్ గౌడ్, బత్తుల అనుష మహేష్ గౌడ్, ముద్దం లింగస్వామి గౌడ్, దండగల వెంకటేశం, దొడ్ల సెట్టయ్య గౌడ్, పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుగౌడ్, తాటిపాముల శ్రీశైలం గౌడ్, సాంకేతిక సహాయ కురాలు ముద్ద మంజుల, మహిళా సంఘం అధ్యక్షురాలు పెండెం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నల్ల జయప్రద, సప్పిడి కల్పన, గ్రామపెద్దలు, ఉపాధి హామీ కూలీలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆచరించాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్**







**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 2:** మహాత్మా గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మహబూబాబాద్ రైల్వే ట్రాక్ ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వయంగా చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశుభ్రతను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్లు, జిల్లా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మతసామరస్యం, ప్రజా రక్షణకు పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

**• జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 2:** మతసామరస్యం, ప్రజా రక్షణ కోసం పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సూచించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అహింస, సత్యం, శాంతి వంటి గాంధీజీ సిద్ధాంతాలు పోలీసు వ్యవస్థకు మార్గదర్శకమన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ నిబద్ధత, పారదర్శకతతో విధులు నిర్వహించాలని సూచించారు. పౌరుల హక్కులను గౌరవిస్తూ సామాజిక న్యాయం, సమానత్వానికి అనుగుణంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మహబూబాబాద్ పట్టణ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, ఆర్ఐలు భాస్కర్, నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పంతంగి అభివృద్ధికి కాకి శ్రీలత సుందర్ ప్రణాళిక!

**గ్రామసభలో వికసిత్ భారత్ ప్రణాళికకు కీలక తీర్మానాలు**

**ప్రజల అవసరాలే ప్రాధాన్యం.. పంతంగి అభివృద్ధికి శ్రీలత సుందర్ శ్రీకారం"**






**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 2:** చౌటుప్పల్: గాంధీ జయంతిని పురస్కరించుకొని పంతంగి గ్రామపంచాయతీలో సర్పంచ్ కాకి శ్రీలత సుందర్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి కార్యక్రమంతో పాటు గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో వికసిత్ భారత్ గ్రామపంచాయతీ ప్రణాళిక 202728లో భాగంగా గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులపై సర్పంచ్ కాకి శ్రీలత సుందర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్రామ ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకొని పలు అంశాలపై చర్చించి, అభివృద్ధి పనులకు సంబంధించిన పలు తీర్మానాలను గ్రామసభలో ఆమోదించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాకి శ్రీలత సుందర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. గ్రామానికి అవసరమైన పనులను ప్రజల అభిప్రాయాల మేరకు గుర్తించి, వాటిని వికసిత్ భారత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో చేర్చి దశలవారీగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా రూపొందించే ప్రణాళికతో పంతంగి గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో గ్రామాభివృద్ధిపై విస్తృతంగా చర్చించడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్మానాలు చేయడం ద్వారా పంతంగి గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయ సదానందం, పంచాయతీ కార్యదర్శి కె. పద్మజ, వార్డు సభ్యులు, పంతంగి గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య పరిశ్రమ సంఘం అధ్యక్షుడిగా తలారి వీరేష్ ముదిరాజ్

**- నిజాంపేట్ సర్కిల్ మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కమిటీ ప్రకటన**

**- ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తా: తలారి వీరేష్**






**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 2:** నిజాంపేట్: నిజాంపేట్ సర్కిల్ మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా నిజాంపేట్‌కు చెందిన మాజీ కో-ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. సంఘం ఉపాధ్యక్షుడిగా బొర్ర రమేష్, జనరల్ సెక్రటరీగా టీ. రాజు నియమితులైనట్లు వెల్లడించింది. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తలారి వీరేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. వీరేష్ ముదిరాజ్ నియామకం పట్ల నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ చందు ముదిరాజ్, గోపాల్, ఆంజనేయులు, జీతాయ్య, ఎన్. రాజు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.



# కష్టకాలంలో పార్టీకి అండగా.. ప్రజల మధ్య తనదైన ముద్ర!

**- కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూర్కంటి వెంకట్‌రెడ్డి**

**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 2:** పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉంటూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూర్కంటి వెంకట్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో చౌటుప్పల్ మండలంలో కాంగ్రెస్ కష్టకాలాన్ని ఎదుర్కొన్నప్పటికీ పార్టీకి, కార్యకర్తలకు అండగా నిలిచారని తెలిపారు. ఐదేళ్లు ఎంపీపీగా, మరో ఐదేళ్లు జెడ్పీటీసీగా పనిచేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని సేవలందించారని పేర్కొన్నారు. పదవులను ప్రజాసేవకు వేదికగా మలుచుకున్నారని అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో సన్నిహితంగా ఉంటూ నియోజకవర్గ రాజకీయాల్లో తనదైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజలకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రభాకర్‌రెడ్డికి ముందస్తుగా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరింతకాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

# జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**• టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో**

**డిమాండ్ల దినోత్సవం**

**తొలి అక్షరం/హన్మకొండ, అక్టోబర్ 2:**
జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గాంధీ జయంతి సందర్భంగా పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టి, అనంతరం గాంధీజీకి నివాళు లర్పించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక భద్రతా చట్టం తీసుకురావాలని, కొత్త వేతన బోర్డు ఏర్పాటు చేయాలని, వైద్య సదుపాయాలను పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజుకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, కార్యదర్శి ఊటుకూరు సాయిరామ్, వల్లాల వెంకటరమణ, పీవీ మదన్‌మోహన్, గడ్డం రాజిరెడ్డి, వేముల నాగరాజు, బొల్లారపు సదయ్యతో పాటు పలువురు జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.






# ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 2:** నెక్కొండ మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శివకుమార్, దుబ్బ నాగరాజు, నరేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మారం రాము, సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మండల కేంద్రంలోని ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టంలోని పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**● గుబ్బ గుర్తి సర్పంచ్ దంతాల ప్రశాంతి**



**తొలి అక్షరం/కొనిజర్ల అక్టోబర్ 2:** ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామపంచాయతీలో గాంధీ జయంతి సందర్భంగా వి.బి. జి రామ్ జి గ్రామసభ నిర్వహణగుబ్బగుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో గాంధీ జయంతి సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ తంతాల ప్రశాంతి అధ్యక్షతన వి.బి. జి రామ్ జి గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభలో గ్రామ సెక్రెటరీ నరేష్ సొసైటీ డైరెక్టర్ మీర్జా కాసిం బేగ్ ఫీల్డ్ అసిస్టెంట్ బి సునీల్ వార్డు సభ్యులు మరియు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, పార్టీ ప్రతినిధులు, పుర ప్రముఖులు , తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు వివరాలను తెలియజేశారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలకు చౌటుప్పల్‌లో ఘనంగా శ్రీకారం!

**● ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించిన చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**



**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 2:** పట్టణంలోని శ్రీ సోమనాథ క్షేత్రంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను చౌటుప్పల్ పురపాలక చైర్‌పర్సన్ మొగుదాల పావని శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె శ్రీ సోమనాథ మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మికత, భక్తిభావాన్ని పెంపొందించేలా నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని చైర్‌పర్సన్ మొగుదాల పావని కోరారు. నవరాత్రుల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల వివరాలను శ్రీ సోమనాథ క్షేత్ర స్థానిక కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, క్షేత్ర కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మద్దులపల్లిలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**- వీబీజీరామ్‌జీ పథకంపై గ్రామసభ నిర్వహణ**





**తొలి అక్షరం /మహాదేవపూర్ అక్టోబర్ 2:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ పోషించిన కీలక పాత్రతో పాటు దేశానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం వీబీజీరామ్‌జీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులను గుర్తించి, వాటి ప్రాధాన్యతపై గ్రామస్తులతో చర్చించారు. అవసరమైన అభివృద్ధి పనులపై తీర్మానాలు చేసినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిత, ఉప సర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్ శ్రీకళ, వీవోఏ లక్ష్మి, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీకి నివాళులర్పించి ప్రత్యేక గ్రామసభ

**- సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్**





**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 2:** నెక్కొండ మండలం బంజరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి సర్పంచి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన సేవలు, పోరాటం చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక గ్రామసభ నిర్వహించి గ్రామ అభివృద్ధి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీర్రు రాధిక, ఉపసర్పంచి ఎర్ర సుజాత రాజు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మ గాంధీ 157వ జన్మదిన వేడుకలు

**తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 02:** నెల్లికుదురు మండలం కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ జన్మదిన వేడుకలు ఎంపీడీవో సింగారపు కుమార్ ఘనంగా నిర్వహించడం జరిగింది. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది ఎంపీడీవో సింగారపు కుమార్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ చేపట్టిన ఉప్పు సత్యా గ్రహం అహింస పద్ధతి ద్వారానే దేశానికి స్వాతంత్రం రావడం జరిగిందని చెప్పడం జరిగింది. అందుకనే మహాత్మా గాంధీని జాతిపిత అని కూడా అంటారు. అని చెప్పడం జరిగింది. అదేవిధంగా అన్నగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహిళ సాధికారికత వంటి సామాజిక సంస్కరణలను మహాత్మా గాంధీ ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందనిఅని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సింగారపు కుమార్, కార్యాలయంలో పనిచేసే అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

**- వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యేలు**



**తొలి అక్షరం/హన్మకొండ, అక్టోబర్ 2:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 58వ డివిజన్ రోజ్‌గార్డెన్‌లో వడ్డేపల్లి దళిత సంక్షేమ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ప్రారంభించారు. ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మెడీకేర్ జనరల్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, వైద్య సలహాలు అందించారు. ఎమ్మెల్యేలు శిబిరాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని పరిశీలించి రక్తదాతలను అభినందించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేసేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ కమిటీ ప్రతినిధులు, వైద్య బృందం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి 150 పోస్ట్‌కార్డులు

**- క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని జర్నలిస్టుల డిమాండ్**



**తొలి అక్షరం/హన్మకొండ, అక్టోబర్ 2:** జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజేహెచ్-143 రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హన్మకొండలో ఉత్తరాల ఉద్యమం నిర్వహించారు. పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 150 పోస్ట్‌కార్డులు పంపించారు. జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులతో పాటు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని మండల కేంద్రాల్లోనూ కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గోగు హరిప్రసాద్

**- ఏకగ్రీవంగా ఎన్నిక**



**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 2:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా గోగు హరిప్రసాద్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంపల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ శాఖ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్, మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి తదితరులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన అధ్యక్షుడు గోగు హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలే గాంధీజీకి నిజమైన నివాళి





**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 2:** బెస్ట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో కక్కిరేణి గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపకుడు బుక్కా ఈశ్వరయ్య, సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేసి, గ్రామ సర్పంచ్, పాలకవర్గాన్ని సన్మానించారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడమే గాంధీజీకి నిజమైన నివాళి అని బుక్కా ఈశ్వరయ్య అన్నారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# నకిరేకల్‌లో గాంధీ జయంతి వేడుకలు

**● ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేత దైద రవీందర్**



**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 2:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీజీ ఆశయాలు, అహింసా సిద్ధాంతాల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుంకుడుపాములలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు






**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 2:** కుంకుడుపాముల గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యలపై చర్చించారు. 'వీబీజీ రాంజీ' పథకం ప్రాముఖ్యత, సంబంధిత అంశాలను గ్రామస్తులకు వివరించారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్, వార్డు సభ్యుడు బెల్లి లింగయ్య యాదవ్, పంచాయతీ కార్యదర్శి శిరీష, అంగన్‌వాడీ టీచర్ విజయలలిత, ఆశా కార్యకర్త వసంత, గ్రామ ప్రముఖులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఒగ్గు బీర్లా కళాకారుల సంఘానికి నూతన కమిటీ

● కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా నూతన కమిటీ



తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 2:షాద్‌నగర్ నియోజకవర్గ ఒగ్గు బీర్లా కళాకారుల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడిగా పిప్పళ్ల శేఖర్ (మునేష్), ఉపాధ్యక్షుడిగా పసుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శులుగా పసుల ఆంజనేయులు, బీర్ల సాయి తేజ ఎంపికయ్యారు. కోశాధికారులుగా పార భాను ప్రసాద్, కుర్వ పరమేష్, సలహాదారులుగా నక్క అంజయ్య, గడ్డమీది తులసయ్య, ఎత్తిన కుమార్, బోగ ప్రశాంత్, గొంగళ్ళ బిక్షపతి, కుర్వ మల్లేష్‌లను నియమించారు.మండలాల వారీగా కూడా నూతన కమిటీలను ప్రకటించారు. ఫరూక్‌నగర్‌కు బీర్ల శ్రీను, అంకగొల్ల శ్రీకాంత్; కొందుర్గ్‌కు కుంటోళ్ల నరేష్, ఇంటేంక నరేష్; జిల్లేడు చౌదరిగూడెంకు మార్గారి నర్సింలు, కేషమోని రమేష్‌లను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎంపిక చేశారు. కేశంపేటకు కోరే శంకరయ్య, బురమోని సాయి; కొత్తూరుకు కాట్న మల్లేష్, కాట్న కుమార్; నందిగామకు చికుర్తి సురేష్, ఎత్తిన శ్రీకాంత్; షాబాద్‌కు ఒగ్గు శంకరయ్య, మిద్దెంగూడ మల్లేష్‌లను నియమించారు.కళాకారుల సంక్షేమం, ఒగ్గు బీర్లా కళను ప్రోత్సహించడం, కళాకారుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

# ఐక్యతతో ఓబీసీ కులగణన కోసం ఉద్యమిద్దాం

## అక్టోబర్ 4న గొల్లపల్లి రోడ్డులో జరిగే బహిరంగ సభను విజయవంతం చేద్దాం



తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 2:ఓబీసీ కులగణన, బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలనే డిమాండ్‌తో బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని జిల్లేడు చౌదరిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయినోనిపల్లి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. అక్టోబర్ 4న శంషాబాద్ పరిధిలోని గొల్లపల్లి రోడ్డులో టీపీసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.జిల్లేడు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల హక్కుల సాధనకు జాతీయ స్థాయిలోనూ పోరాటం అవసరమని పేర్కొన్నారు. సభకు బీసీ వర్గాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.**చౌదరిగూడెం నుంచి వెయ్యి మందితో తరలివస్తాం** అక్టోబర్ 4న జరిగే బహిరంగ సభకు జిల్లేడు చౌదరిగూడెం మండలం నుంచి సుమారు వెయ్యి మందితో తరలివస్తామని కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న సభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు కల్పించేందుకు బీసీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెలిజర్లలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

## గ్రామసభలో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ




తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 2:గాంధీ జయంతిని పురస్కరించుకుని వెలిజర్ల గ్రామపంచాయతీ ఆవరణలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు, 202627 ఆర్థిక ప్రణాళికపై చర్చించారు.గ్రామంలో నెలకొన్న తాగునీరు, విద్యుత్, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఉపాధి హామీ పథకం, పారిశుద్ధ్య సమస్యలను ప్రజలు పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, వితంతు పింఛన్లకు సంబంధించిన సమస్యలను కూడా సభలో ప్రస్తావించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పాలకవర్గం తెలిపింది. 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళిక, నిధుల వినియోగం, గ్రామ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పాలకవర్గం పేర్కొంది.కార్యక్రమంలో సర్పంచ్ ఆర్. బాబు నాయక్, గ్రామ కార్యదర్శి మల్లేష్, ఉపసర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, జీపీఓ విష్ణు యాదవ్, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరిలో బడ్జెట్ స్కూల్స్ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు

## - చైతన్య విద్యాలయం ఉపాధ్యాయులకు ఘన సత్కారం




తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 2 :బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో భువనగిరిలోని వివేరా హోటల్‌లో యాదాద్రి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రపాలనగరానికి చెందిన చైతన్య విద్యాలయం ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు.బెస్ట్ కరస్పాండెంట్ అవార్డును గుంటోజు భవాని కనకాచారి, బెస్ట్ టీచర్స్ అవార్డులను బద్దుల ప్రవీణ్, కొమ్మగోని మమత, గర్దాస్ భవానీ అందుకున్నారు. అవార్డులను రాష్ట్ర బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపతి రెడ్డి, రాష్ట్ర జనరల్ ప్రెసిడెంట్ జలేందర్, జనరల్ సెక్రటరీ మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లేశం, టీజీబీ చిట్టిబాబు చేతుల మీదుగా అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

## - గాంధీ మార్గంలోనే అడుగు ముందుకు వేద్దాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 2: షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంచి మనసున్న వారి గుండెల్లో మహాత్మా గాంధీ ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో ఆయన కలలుగన్న స్వరాజ్య సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, కౌన్సిల ర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యూ పవర్ కుంగ్‌ఫు అకాడమీ ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళులు



తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 2: గాంధీ జయంతిని పురస్కరించుకుని షాద్‌నగర్ పట్టణంలోని సత్యనారాయణ ఆలయం వద్ద న్యూ పవర్ కుంగ్‌ఫు అకాడమీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు. అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో కుంగ్‌ఫు విద్యార్థులు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని చరిత్రపై చెరగని ముద్ర వేసిన మహాత్మా గాంధీకి నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజం శాంతి, ఐక్యత వైపు సాగాలని ఆకాంక్షించారు.



# గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 2: గాంధీ జయంతి సందర్భంగా ఫరూఖ్‌నగర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, శాంతి, సహనం మార్గాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ చేసిన సేవలు, దేశం కోసం సాగించిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే సమాజంలో శాంతి, సమానత్వం, సోదరభావం పెంపొందుతాయని తెలిపారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, పట్టణ, మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం: సర్పంచ్ ఎర్రోళ్ల జగన్

## - గాంధీ ఆశయాలతో గ్రామాభివృద్ధికి కృషి

తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 02: కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ దేశానికి చేసిన సేవలు, ఆయన ఆశయాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సభ నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. సర్పంచ్ జగన్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య తలెత్తినా ప్రజలతో సామరస్యంగా చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సలహాలు, సూచనలు తీసుకుంటూ అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్, ఉపసర్పంచ్ శాంతన్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఏఎన్‌ఎం సునంద, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్, గ్రామ యువజన సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# బోగారం గ్రామపంచాయతీలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 2: రామన్నపేట మండలం బోగారం గ్రామపంచాయతీ ఆవరణంలో నేడు మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత మార్గాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సంఘ బంధం అధ్యక్షురాలు, వీవో, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గడ్డమీద అంజయ్య ముదిరాజ్ కుటుంబానికి సంఘం పరామర్శ

- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

**తెలిపిన ముదిరాజ్ సంఘం నాయకులు**



**తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 2:** షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సంఘం తాలూకా సంయుక్త కార్యదర్శులు గడ్డమీద రమేష్ ముదిరాజ్, గడ్డమీద శ్రీహరి ముదిరాజ్‌ల తండ్రి గడ్డమీద అంజయ్య ముదిరాజ్ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను సంఘం నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా తాలూకా యువత అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్ మాట్లాడుతూ.. అంజయ్య ముదిరాజ్ గతంలో కుల పెద్దగా ఉంటూ సంఘానికి విలువైన సలహాలు, సూచనలు అందించేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు ముదిరాజ్ సంఘానికి తీరని లోటని అన్నారు. అంజయ్య ముదిరాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, విషాద సమయంలో కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తాలూకా యువత ఉపాధ్యక్షుడు మంగ అశోక్ ముదిరాజ్, కోశాధికారి కొండే యాదయ్య ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ పాలమాకుల చెన్నయ్య ముదిరాజ్, పిట్టల అంజయ్య ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు గుగ్గిల రవికుమార్ ముదిరాజ్, చల్ల భరత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చందర్ రావుకు కల్లూరులో ఘన స్వాగతం

**- విదేశీ పర్యటన ముగించుకుని స్వగ్రామానికి చేరుకున్న జిల్లా కాంగ్రెస్ నేత**

**తొలి అక్షరం/కల్లూరు, అక్టోబర్ 2:** ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్ రావు విదేశీ పర్యటన ముగించుకుని తన స్వగ్రామమైన కల్లూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పెద్దబోయిన నరసింహారావు, ఉబ్బన రాంబాబు, బీరవల్లి మాధవ్, గుండ్ల పుల్లారావు, దాసరి సుధారాణి, యాసా నాగమణి శ్రీకాంత్, ఖమ్మంపాటి రాధా వీరస్వామి, శీలం స్వాతి భాస్కర్‌రెడ్డి తదితరులు చందర్రావుకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చందర్రావు మాట్లాడుతూ తనకు కల్లూరులో ఇంతటి ఘన స్వాగతం లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనపై ప్రేమాభిమానాలతో స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు, ఆర్యవైశ్య సోదరులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అహింసా మార్గమే గాంధీజీ బోధన

**- కల్లూరులో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు**

**తొలి అక్షరం/కల్లూరు, అక్టోబర్ 2:** కల్లూరు పట్టణంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. గాంధీజీ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డి. చంద్రశేఖర్, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్‌రావు మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ప్రపంచానికి ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కౌన్సిలర్లు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురం గ్రామంలో రీ-సర్వే పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలన

**తొలి అక్షరం/తల్లాడ, అక్టోబర్ 2:** మండల పరిధిలో లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే ప్రక్రియలో చేపడుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ రైతులతో సబ్ కలెక్టర్ సమావేశమై, రీ సర్వే ప్రక్రియకు సంబంధించిన వారి సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకొని, ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.

# ప్రతిభకు చేయూత క్రికెట్ స్టార్‌గా ఎదగొచ్చు

**తొలి అక్షరం/కల్లూరు, అక్టోబర్ 2 :** క్రికెట్‌పై ఉన్న అపారమైన ఆసక్తితో చిన్న వయసులోనే తన ప్రతిభను చాటుకుంటున్న బాలుడు వాసవి లోకేష్ ప్రస్తుతం క్రికెట్‌లో మంచి గుర్తింపు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. 8వ తరగతి కల్లూరులో చదువుకున్నాడు. ప్రస్తుతం 9వ తరగతిలో కందుకూరి క్రికెట్ అకాడమీలో చేరి క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నాడు. చదువుతో పాటు క్రికెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి, భవిష్యత్తులో మంచి క్రికెటర్‌గా ఎదగాలని కలలు కంటున్నాడు. అయితే ప్రతిభ ఉన్నప్పటికీ శిక్షణ, క్రికెట్ కిట్, ఇతర అవసరాలకు అయ్యే ఖర్చులు కుటుంబానికి భారంగా మారుతున్నాయి. ప్రోత్సాహం, ఆర్థిక సహాయం లభిస్తే లోకేష్ తన ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ఒక చిన్నారి కలను నిజం చేయడానికి మనం అందించే చిన్న సహాయం కూడా అతని భవిష్యత్తుకు పెద్ద బలంగా నిలవవచ్చు. క్రికెట్‌ను ప్రేమించే దాతలు, సేవాభావం ఉన్న వ్యక్తులు లోకేష్‌కు తమ వంతు సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సత్యనాగ స్వచ్ఛంద సేవా సొసైటీ డాక్టర్ కావేటి రాధాకృష్ణమూర్తి (ఎన్జీవో) సహాయం/వివరాల కోసం 9030027911 సంప్రదించగలరు.

# సీనియర్ల అనుభవం..సమాజానికి దీపం

**- సమాజ ప్రగతిలో వృద్ధుల పాత్ర అమోఘం**

**- మల్కాజిగిరి సీపీ బి.సుమతి ఐపీఎస్**

**- ఘనంగా టాస్కా చిల్కానగర్ డివిజన్ నూతన శాఖ ఆవిర్భావం**







**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్2:** తీర్చిదిద్దిన అనుభవాల వెలుగుతో సమాజాన్ని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత సీనియర్ సిటిజన్లపైనే ఉందని మేడ్చల్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి ఐపీఎస్ స్పష్టం చేశారు. నేటి తరానికి సీనియర్ల అనుభవ సంపదే కొండంత బలమని ఉద్ఘాటించారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కా) చిల్కానగర్ డివిజన్ నూతన శాఖ ఆవిర్భావ మహాసభ శుక్రవారం చిల్కానగర్‌లోని నోవా బాంకెట్ హాల్‌లో బొమ్మగాని దాస్ గౌడ్ అధ్యక్షతన అంగరంగ వైభవంగా జరిగింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం ఈ వేడుకలను అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించి 60 వసంతాలు పూర్తిచేసుకున్న సుమారు 100 మంది సీనియర్ సిటిజన్లు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సుమతి మాట్లాడుతూ....నేడు సమాజం అనుభవిస్తున్న అభివృద్ధి,సౌకర్యాల వెనుక మునుపటి తరాల కష్టం,త్యాగం దాగి ఉన్నాయి అని అన్నారు. మొదటి తరం బాటలు వేస్తే నేటి యువత మూడో తరంగా అభివృద్ధి ఫలాలను అందుకుంటోంది అని అన్నారు. సీనియర్లు తమ ఆలోచనలను యువతపై బలవంతంగా రుద్దకుండా వారిలోని అపారమైన శక్తి సామర్థ్యాలను గుర్తించి సరైన దిశానిర్దేశం చేయాలి అని పిలుపునిచ్చారు. బలమైన కుటుంబ వ్యవస్థ నిలబడాలంటే తరాల మధ్య అవగాహన,పరస్పర గౌరవం అత్యంత కీలకమని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ల భద్రత,సంక్షేమం,చట్టపరమైన హక్కుల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని భరోసానిచ్చారు. అనంతరం ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ..చిల్కానగర్ పరిధిలో వృద్ధుల ఆరోగ్యం, మానసిక ఉల్లాసానికి అనువైన సామాజిక పార్కు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం త్వరలోనే ప్రభుత్వం నుంచి స్థలాన్ని కేటాయించేలా పక్కా ప్రతిపాదనలు సిద్ధం చేస్తానని హామీ ఇచ్చారు. టాస్కా రాష్ట్ర అధ్యక్షులు పి.నరసింహారావు మాట్లాడు తూ.. ప్రభుత్వ ఆఫీసుల్లో వృద్ధులు ఎదుర్కొంటున్న వేధింపులు,ఆలస్యానికి చెక్ పెట్టేందుకు ప్రతి కార్యాలయంలోనూ ప్రత్యేక సీనియర్ సిటిజన్ సెల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధుల అర్జీలకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకో వాలన్నారు. చిల్కానగర్ డివిజన్ నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొమ్మగాని దాస్ గౌడ్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల సహకారంతో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక భవనం,వాకింగ్ ట్రాక్, పార్కు ఏర్పాటుకు శాయశక్తులా కృషి చేస్తానని, సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.

**టాస్కా చిల్కానగర్ డివిజన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం:** ఈ కార్యక్రమంలో భాగంగా చిల్కానగర్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు బొమ్మగాని దాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోడ విద్యా సాగర్, కోశాధికారి షామీర్‌పేట్ చంద్రయ్య, సలహాదారులు శంభు ప్రసాద్,పెండెం నాగార్జున, రామ్‌చర్ల బలరాం,దండు అంజయ్య, కార్యవర్గ సభ్యులు మరో 10 మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి,టాస్కా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి వెంకటయ్య గౌడ్, రాజిరెడ్డి,స్థానిక నాయకులు దేవసాని బాలచం దర్,నెర్థం భాస్కర్ గౌడ్,అంబటి జగదీష్,పురుషోత్తం, శ్రీనివాస్ రెడ్డి,పల్లె రాములు, సదాశివరెడ్డి,పి.రామ్ రెడ్డి,లతీఫ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

**- అసోసియేషన్ అధ్యక్షురాలు చింతపంటి కవిత**

**- పాలకులు,అధికారుల నిర్లక్ష్యంపై జయప్రద కాలనీవాసుల తిరుగుబాటు**

**- నడిరోడ్డులో ప్రమాదకర బండరాయి తొలగింపు పనులు ప్రారంభం**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్2:** ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు..రోడ్లు సరిగా లేక,కనీస సౌకర్యాలు కరువై నిత్యం నరకయాతన అనుభవిస్తున్నా అధికారుల గుండె కరగలేదు. ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యం. దీంతో విసిగెత్తిన ఆ కాలనీవాసులు ఇక లాభం లేదనుకున్నారు. మా సమస్యకు మేమే పరిష్కారం చూపుకుంటాం అంటూ నడుం బిగించారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పాలకుల నిర్లక్ష్యానికి సవాల్ విసిరారు. మేడ్చల్ జిల్లా చెంగిచర్ల డివిజన్ పరిధిలోని జయప్రద కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సొంత నిధులతో రహదారి నిర్మాణం,మరమ్మతు పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా కాలనీ ప్రధాన రహదారికి సరిగ్గా నడిమధ్యలో ఉంటూ వాహనదారులు,బాటసారులకు నిత్యం నరకం చూపిస్తున్న భారీ బండరాయిని తొలగించేందుకు జెసిబి, కంప్రెషర్ యంత్రాలతో పనులు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలు చింతపంటి కవిత మాట్లాడుతూ...కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. ప్రధాన రహదారిలో ఉన్న భారీ బండరాయి వల్ల రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న పనైనా ప్రజల ప్రాణాల రక్షణే ధ్యేయంగా కాలనీవాసులందరూ చందాలు వేసుకుని సొంత నిధులతో ఈ పనులను చేపట్టామని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ,స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిదీపాలు,డ్రైనేజీ,సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీటీ/సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి చీరల నీలమ్మ,ఉపాధ్యక్షులు జి.హరి నాయక్,కోశాధికారి ఓక్ ఓబులేసు,జాయింట్ సెక్రటరీ పి.పౌలు,కార్యవర్గ సభ్యులతో పాటు కాలనీవాసులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# డీజీపీ కార్యాలయంలో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్2:** గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం డీజీపీ కార్యాలయంలో (హెడ్ క్వార్టర్స్) మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉన్నతాధికారులు, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. సత్యం, అహింసే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన బాపూజీ అడుగుజాడలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.